dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ | 12 సోమవారం, అక్టోబర్ 2026







# పద్మనగర్‌లో టీటీడీ శ్రీవారి ఆలయ నిర్మాణానికి ముహూర్తం ఖరారు:

## అక్టోబర్ 17న పనులు ప్రారంభం

**కరీంనగర్ డీసీ**

కరీంనగర్ నగరవాసుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడనుంది. పద్మనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ నెల 17న మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 9 గంటలలోపు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెల్లడించారు. ఆదివారం ఆయన టీటీడీ అధికారులతో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, పనుల ఏర్పాట్లను సమీక్షించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ..**

గతంలో కేసీఆర్ ప్రభుత్వ సహకారంతో టీటీడీ అనుమతులు సాధించి, పద్మనగర్‌లో పది ఎకరాల భూమిని టీటీడీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. 2023 మే 31న భూమిపూజ నిర్వహించినప్పటికీ, తదనంతరం వచ్చిన ఎన్నికల వల్ల పనుల ప్రారంభంలో ఆలస్యం జరిగిందన్నారు.

**తిరుమలను తలపించేలా రూపకల్పన:**



పది ఎకరాల విశాలమైన ప్రాంగణంలో అచ్చం తిరుమల ఆలయాన్ని తలపించేలా ఈ దివ్యక్షేత్రాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంప్రదాయ ఆగమ శాస్త్రాల ప్రకారం -- ప్రధాన ద్వారం, గర్భాలయం, అర్ధమండపం, ముఖమండపం, గరుడాళ్వార్ సన్నిధి తదితర నిర్మాణాలతో ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించనున్నామని తెలిపారు. ఈ ఆలయం పూర్తయితే కరీంనగర్తో పాటు పరిసర జిల్లాల భక్తులకు స్వామివారి దివ్య దర్శనం మరింత చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరి శంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, టీటీడీ ఏఈ నాగరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




# వెలిచాల లో 15వ శ్రమదానం

- **అయ్యవారికుంట ఆలయం, బతుకమ్మ ఘాట్ లో ముమ్మర పరిశుభ్రత**
- **స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఘనంగా శ్రమదానం**

**కరీంనగర్ డీసీ**

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామ శివారు కిష్టారావుపల్లిలో స్వచ్ఛతా హి సేవ లో భాగంగా ఆదివారం 15వ శ్రమదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన పర్యాటక ప్రాంతమైన అయ్యవారికుంట భక్తాంజనేయ స్వామి దేవాలయం మరియు బతుకమ్మ ఘాట్ పరిసరాలలో ఈ శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ పరిసరాలు, ఘాట్ మెట్లు, కుంట గట్టు వెంబడి పేరుకుపోయిన చెత్త, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగరావు నాయకత్వం వహించారు. ఆయనతో పాటు ఉప సర్పంచ్ ఎల్లమల వసంత, వార్డు సభ్యులు, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వయంగా పారలు, చీపుర్లు పట్టి శ్రమదానం



చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీర్ల నర్సింగరావు మాట్లాడుతూ... స్వచ్ఛమైన గ్రామమే మన లక్ష్యం. ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ శ్రమదాన కార్యక్రమం నేటికి 15వ వారానికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. భక్తులు అధికంగా వచ్చే అయ్యవారికుంట ఆలయాన్ని, బతుకమ్మ ఘాట్ ను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతన్నారు. గ్రామ ప్రజలందరూ సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తాంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు.

dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER




కరీంనగర్ | 12 సోమవారం, అక్టోబర్ 2026

## నేడు రైతు వేదికల్లో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్



**జగిత్యాల డీసీ**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించనున్నారు. జగిత్యాల జిల్లాలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కలిగిన అన్ని రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ప్రస్తుత పంటలను కాపాడుకునేందుకు తీసుకో వాల్సిన చర్యలు, రాబోయే యాసంగి సీజన్‌లో పంటల సాగు ప్రణాళిక, ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, తీవ్ర కరువును ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ముఖ్యమంత్రి రైతులకు మార్గదర్శనం చేయనున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించనున్నారు. కావున జిల్లాలోని వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కలిగిన అన్ని రైతు వేదికల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మంత్రులకు ముందస్తు సమాచారం అందించి, రైతుల భాగస్వామ్యం పెరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

